క్లుప్తంగా

రేపు రాజానగరంలో వైద్య శిబిరం

శిరివెళ్ల: ఈ నెల 21, 22 తేదీల్లో రాజానగరంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్ తెలిపారు. హైదరాబాద్ బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్, కర్నూల్ మెడికేర్‌కు చెందిన ప్రముఖ వైద్యులతో శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో శుక్రవారం నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి గురువారం తెలిపారు. వీక్లీ మార్కెట్ ఫిల్టర్ బెడ్‌లో నీటి పంపులను శుభ్రం చేయనుండటంతో వైఎస్సార్‌నగర్, నందమూరినగర్, బాలాజీ కాంప్లెక్స్, ముల్లాన్‌పేట, ఫరూక్‌నగర్, గుడిపాటిగడ్డ, తోటలైన్, హరిజనవాడ, బైర్మల్‌వీధి, బంగారు అంగళ్ల వీధి, సంగంపేట, తెలుగుపేట, రోజా కుంట, చాంద్‌బాడా, శ్రీనివాసనగర్, సంజీవ నగర్, డేనియల్‌పురం, రామనాథరెడ్డినగర్, పద్మావతినగర్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని చెప్పారు. ప్రజలకు ఏదైనా అసౌకర్యం కలిగితే సెల్ : 7702776048 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నేడు రెవెన్యూ గ్రామసభ

ఉయ్యాలవాడ: మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రతి చిన్నారికి ఆధార్ తప్పనిసరి



మాయలూరులో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ: పుట్టిన ప్రతి చిన్నారికి తప్పనిసరిగా ఆధార్ నమోదు చేయించుకోవాలని, క్షేత్రస్థాయిలో సచివాలయ ఉద్యోగులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. గురువారం మండలంలోని మాయలూరు గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ శిబిరాలను ఆయన పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 0–5 ఏళ్లలోపు చిన్నారులందరికీ కొత్త ఆధార్ కార్డు నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు కొనసాగిస్తున్నామన్నారు. మూడు రోజులుగా అల్లూరు, మాయలూరు కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాల్లో 50 మంది చిన్నారులకు కొత్త ఆధార్ నమోదు చేసినట్లు వెల్లడించారు.

నిధులు విడుదల

నంద్యాల(న్యూటౌన్): వ్యాయామ విద్యకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని ఏపీపీఈటీ అండ్ ఎస్ఏపీడీ అసోసియేషన్ ట్రెజరర్ సోమన్న యాదవ్ గురువారం తెలిపారు. ప్రైమరీ స్కూల్‌కు రూ.7వేలు, అప్పర్ ప్రైమరీ స్కూల్‌కు రూ.14వేలు, హైస్కూల్‌కు రూ.30వేల ప్రకారం స్పోర్ట్స్ మెటీరియల్‌కు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు.


అబాకస్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 14, 15 తేదీల్లో ఢిల్లీలో జరిగిన యూసీమాస్ అబాకస్ కాంపిటీషన్‌లో నంద్యాలకు చెందిన శ్రీచైతన్య పాఠశాల ఎస్–2 బ్రాంచ్‌లో 3వ తరగతి చదువుతున్న విద్యార్థిని సఫూరా జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్, ఇంటర్నేషనల్ లెవెల్‌లో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు పాఠశాల ఏజీఎం సురేష్, ఆర్ఐ కోటయ్య చౌదరి, ప్రిన్సిపాల్ భూపని విజయలక్ష్మి గురువారం తెలిపారు.విద్యార్థి, తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. ఏఓ జువైద్, వైస్ ప్రిన్సిపాల్ రాధమ్మ, డీన్ దస్తగిరి, సరిత ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ చంద్రశేఖర్

నంద్యాల(అర్బన్): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని 26వ వార్డు కౌన్సిలర్ మేస చంద్రశేఖర్ వార్డు పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలకు గుర్తుగా ఏటా క్రిస్మస్ సందర్భంగా కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దాసు, బొమ్మదాసు పాల్గొన్నారు.

రసాభాసగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

- వాదోపవాదాల నడుమ సమావేశం
- చిన్నవంగలిలో మొక్కల మాయంపై ఏపీఓ, సిబ్బందిపై పీడీ ఆగ్రహం
- రూ.8.5 లక్షలు దుర్వినియోగం జరిగినట్లు గుర్తింపు



సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు



ఏపీఓ, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ జనార్దనరావు

చాగలమర్రి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సామాజిక ప్రజావేదిక ఇరువర్గాల వాదోపవాదాలు, వాగ్వాదాల నడుమ రసాభాసగా జరిగింది. ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన జాతీయ ఉపాధి హామీ పనులపై జరిగిన తనిఖీల నివేదికను చదివి వినిపించారు. చాగలమర్రి మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 1612 పనులకు సంబంధించి సుమారు రూ. 10 కోట్లు మంజూరు చేశారు. వాటిలో పని చేసిన కూలీలకు సుమారు రూ.6.30 కోట్లు, సామాగ్రికి రూ.3.70 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులను గ్రామాల వారీగా సామాజిక తనిఖీ సిబ్బంది ఈ నెల 8వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి విచారించింది. అలాగే పని చేసిన ప్రదేశానికి వెళ్లి కొలతలు తీసి రికార్డుల్లో నమోదైన వాటితో పరిశీలించి నివేదికను తయారు చేశారు. గ్రామ సభలు నిర్వహించి వివరించారు. సామాజిక తనిఖీ ప్రజావేదికలో గ్రామాల వారీగా నివేదికలను డ్వామా పీడీ జనార్దన్‌రావు సమక్షంలో డీఆర్పీలు చదివి వినిపించారు. మండలంలో జరిగిన పనుల్లో సుమారు రూ.8.10 లక్షలు దుర్వినియోగం అయినట్లు తెలిపారు. గ్రామాల నివేదికలు చదువుతుండగా కొందరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు డీఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో వాదోపవాదాలకు దిగారు. చిన్నవంగలి గ్రామంలో నలుగురు రైతులకు ఉద్యాన పంటల సాగుకు ఇచ్చిన టెంకాయ మొక్కలు లబ్ధిదారుల పొలంలో లేవని డీఆర్పీలు సభ దృష్టికి తేవడంతో పీడీ స్పందించారు. రైతులకు పంపిణీ చేసిన తర్వాత అవి పొలంలో నాటారా లేదా అనే బాధ్య లేదా అని ఏపీఓ నిర్మల, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సజావుగా విధులు నిర్వహించకుంటే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపునకు టీడీపీ స్కెచ్

కాగా ప్రజావేదికను అడ్డం పెట్టుకుని ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపునకు టీడీపీ నాయకులు స్కెచ్ వేశారు. ఉద్దేశపూర్వకంగా రాజీనామా సమర్పించని ఫీల్డ్ అసిస్టెంట్లపై పీడీకి నిరాధారమైన ఫిర్యాదులు చేశారు. అదే సమయంలో కొందరు ఫీల్డ్‌అసిస్టెంట్లతో వాగ్వాదానికి దిగడంతో పోలీసులు వారించారు. మండలంలో గోట్లూరు, చింతలచెరువు, చిన్నబోధనం, గోడిగనూరు, మల్లెవేముల గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేయడంతో ఆ గ్రామాల సామాజిక తనిఖీలో ఏమీ మాట్లాడకుండా, రాజీనామా చేయని చోట్ల రాద్ధాంతం చేయడం గమనార్హం. మద్దూరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఏకంగా 59 ఫిర్యాదులు చేశారు. విచారణను ఏపీడీసాంబశివరావుకు అప్పగించినట్లు తెలిసింది. ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు, సంజామల ఎస్ఐ రమణయ్య, సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి, ఏపీడీలు సాంబశివరావు, బాలాజీనాయక్, అన్వర్‌బేగం, ఎస్ఆర్పీ మురాద్, ఈఓపీఆర్డీ తాహీర్ హుసేన్, ఏపీఓ నిర్మలాదేవి, సర్పంచ్‌లు బాలీశ్వరరెడ్డి, గోవిందయ్య, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.



దొర్నిపాడులో వర్షానికి తడిచిన పత్తి

కలవరపెడుతున్న తుపాను

దొర్నిపాడు: వరుస వర్షాలు రైతులను కలవరపెడుతున్నాయి. రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం అక్కడక్కడ చెదురుమదురుగా చినుకులు రాలడంతో పత్తి, కంది, శనగ పంటలు దెబ్బతింటున్నాయి. ప్రస్తుతం పత్తి తీసే పను ల్లో రైతులు ఉండడంతో చినుకులకు గింజలు తడిసి కుళ్లిపోయే ప్రమాదం ఉందంటున్నారు. ఇలానే మేఘాలు సూర్యరస్మిని బంధిస్తూ ఉంటే శనగలో చీడపీడలు అధికంగా ఉండటమే గాక కంది పూత రాలిపోతుందని రైతులు పేర్కొంటున్నారు.



పొలంలో తేమశాతం అధికంగా ఉండడంతో కుళ్లిపోతున్న శనగ

వైభవంగా తిరుప్పావడ వేడుకలు



స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన తిరుప్పావడ

నంద్యాల(వ్యవసాయం): ధనుర్మాసాన్ని పురస్కరించుకొని సంజీవనగర్ రామాలయంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో గురువారం తిరుప్పావడ సేవా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన జరిపించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పులిహోరను స్వామి వారి ముందు రాశిగా పోసి శ్రీవారి ప్రతిబింబంగా తీర్చిదిద్ది కూరగాయలు, తీపి పదార్థాలు అలంకరించి వేదమంత్రాలతో నివేదన ఇచ్చి స్వామి వారికి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు తిరుప్పావడ సేవ వృత్తాంతాన్ని భక్తులకు వివరించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ, తరుణ్‌కుమార్‌శర్మ, సముద్రాల సూరయ్య, దేవరశెట్టి శ్రీనివాస్, మధుసూదన్ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం



అర్జీలను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

దొర్నిపాడు: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ తెలిపారు. గురువారం మండలంలోని బుర్రారెడ్డిపల్లె గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. అర్జీలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. రైతులకు ఏ సమస్య వచ్చినా రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. తహసీల్దార్ సుభద్ర, డీటీ మాధవ్, మండల సర్వేయర్ నాగ ప్రసాద్, వీఆర్ఓ నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాశురాలతో లోక కల్యాణం



తిరుప్పావై ప్రవచనాలు వినిపిస్తున్న డాక్టర్ దీవీ హయగ్రీవాచారి

నంద్యాల(వ్యవసాయం): ధనుర్మాసాన్ని పురస్కరించుకొని స్థానిక సంజీవనగర్ రామాలయంలో గురువారం శ్రీభగవత్ సేవా సమాజ్ తిరుమల తిరుపతి దేవస్థానం ఆల్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నాల్గవ రోజు తిరుప్పావై పాశురాలను డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు భక్తులకు వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాదేవి గోపికలను నిద్రలేపుతూ తాము చేసే వ్రతం కోసం దేవున్ని ప్రార్థించి లోక కల్యాణం కోసం వర్షం కురిస్తే ముల్లోకాలు బాగుంటాయని వివరించే పాశురం, వర్షాలు కురవనప్పుడు ఈ పాశురం వలన వర్షం పడుతుందని నమ్మకం అని వివరించారు. డాక్టర్ రవీంద్రనాథ్, సూరయ్య, నరహరి నాగేశ్వరరెడ్డి, మధుసూదన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల మృతిపై సంతాపం



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి

చాగలమర్రి: మండల కేంద్రంలోని బసవన్నకట్ట వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, శ్రీవాసవీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ బి.రాఘురాం తండ్రి బి.పద్మనాభుడు (78), సీనియర్ నాయకుడు పోలక్యాయల పెద్దన్న (79) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి చాగలమర్రికి చేరుకుని మృతదేహాలకు నివాళులర్పించారు. ఆయా కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, ఎంపీపీ వీరభద్రుడు, చక్రం ముల్లా, షబ్బీర్ అహ్మద్, పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పత్తి నారాయణ, సి.వెంకటరమణ ఉన్నారు.

ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు వాయిదా వేయాలి

నంద్యాల(అర్బన్): ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణలో భాగంగా 6వ విడత ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను వాయిదా వేయాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాంపక్కీర్‌రెడ్డి, చాంద్‌బాషా కోరారు. స్థానిక కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ ఈనెల చివరి వారంలో క్రిస్మస్ పండుగ, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, డిపార్టుమెంట్ టెస్టులు ఉన్నాయని, క్రిస్మస్ పండుగ నేపథ్యంలో సంబంధిత ఉపాధ్యాయులకు సెలవు వినియోగం, ఐశ్చిక సెలవుల వాడకంలో ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు తలపెట్టిన శిక్షణ తరగతులు వాయిదా వేయాలన్నారు. అలాగే జూలై 2023 నుంచి 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ 2003 వారికి అందాల్సిన పాత పెన్షన్ మంజూరు చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ రూపొందించి కారుణ్య నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. భాస్కర రెడ్డి, భార్గవరామయ్య ఉన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యలకు పరిష్కారం

ఆళ్లగడ్డ: రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్ అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని చింతకుంటలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. రైతులు గ్రామంలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ సదస్సులో మూటేషన్లు, ధ్రువపత్రాలు జారీ చేయడానికి ఎలాంటి రుసుం చెల్లించాల్సి అవసరం లేదని పేర్కొన్నారు. తహసీల్దార్ రత్నకుమారి ఉన్నారు.

కిశోర బాలికల వికాసంపై శిక్షణ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ తేజేశ్వరి

రుద్రవరం: కిశోర బాలికల వికాసంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ తేజేశ్వరి, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, వైద్యాధికారులు జయలక్ష్మి, గాయత్రీ పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఇక్కడ శిక్షణ పొందిన వారంతా మండలంలోని అన్ని పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలకు వెళ్లి కిశోర బాలిక లకు స్కిల్ డెవలప్‌మెంట్, మానసిక సమస్యలు, తీసుకోవాల్సిన పోషకాహారం, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నాగప్రసాదు, ఉపాధ్యాయులు గౌరి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి



నంద్యాలలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): హాస్టళ్లలో విద్యార్థుల ఆకలి కేకలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల మెస్ కాస్మోటిక్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ గురువారం పట్టణంలోని శ్రీనివాససెంటర్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలసరాజు, నాసర్జీ మాట్లాడుతూ చాలా హాస్టళ్లకు సొంత భవనాలు లేవని, ప్రహరీలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరమ్మతులకు నిధులు కేటాయించి, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధనుంజయుడు, ప్రతాప్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సంతోష్, వెంకటేష్ పాల్గొన్నారు.

పశుగ్రాసం పెంపకానికి ప్రోత్సాహం

శిరివెళ్ల: పశుగ్రాసం పెంపక ప్రోత్సాహాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి దస్తగిరి అన్నారు. 5 ఎకరాల్లోపు భూమి ఉన్న సన్నకారు, చిన్నకారు రైతులు 10 సెంట్ల నుంచి అర ఎకరాలో పశుగ్రాసం పెంపకానికి అర్హులన్నారు. పశుగ్రాసం పెంపకానికి ప్రోత్సాహంగా ప్రభుత్వం రూ. 33 వేలు ఇస్తుందన్నారు. బోరు ఉన్న రైతులు వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. అలాగే మండలానికి 11 మినీ గోకులాలు మంజూరు కాగా ఇంత వరకు యర్రగుంట్ల, శిరివెళ్ల, గుండంపాడులలో ఒక్కో గోకులం నిర్మాణం ప్రారంభమైందన్నారు. గుంప్రమాన్‌దిన్నెలో రెండు గోకులాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న నిందితులకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేసినట్లు తాలూకా పోలీసులు గురువారం తెలిపారు. వివరాలు.. నంద్యాల మండలం పొన్నాపురం గ్రామానికి చెందిన సురేంద్రగౌడ్, గొల్ల నాగేంద్రలు గ్రామంలో రోడ్డుపైన వచ్చిపోయే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా సురేంద్రగౌడ్‌కు 30రోజులు, నాగేంద్రకు 20రోజులు జైలు శిక్షను విధించినట్లు వారు వెల్లడించారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడ్డ గుర్తు తెలియని వ్యక్తి

ఆళ్లగడ్డ: గుర్తు తెలియని వాహనం ఢీకొని.. గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం రాత్రి ఆళ్లగడ్డ శివారులోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓ వ్యక్తి మోటర్‌సైకిల్‌పై ఆళ్లగడ్డ నుంచి జమ్మలమడుగు రోడ్డు వైపు వెళ్లేందుకు చిన్న కందుకూరు మెట్ట సమీపంలోకి హైవే రోడ్డును దాటుకుంటున్నాడు. అంతలో నంద్యాలవైపు నుంచి వేగంగా వస్తున్న ఓ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉండగా కారు ఆగకుండా వెళ్లిపోయింది. క్షతగాత్రున్ని అక్కడే ఉన్న చిన్న కందుకూరు కొండారెడ్డి తన వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో నంద్యాల వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ చిరంజీవి తెలిపారు.

ముగిసిన క్రీడా పోటీలు



విజేతగా నిలిచిన జట్టు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న క్రీడా పోటీలు గురువారం ముగిసినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. చివరి రోజు ఫైనల్స్‌లో వాలీబాల్ బాలుర విభాగంలో ఈఎస్సీ జీపీటీ నంద్యాల, ఎస్‌వీఆర్ పాలిటెక్నిక్ కళాశాల మధ్య జరిగిన పోటీల్లో నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ (నంద్యాల), కేవీఎస్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కర్నూలు)పై గెలుపొందింది. ఉత్కంఠ భరితంగా జరిగిన కబడ్డీ ఫైనల్‌లో వాసవీ పాలిటెక్నిక్(బనగానపల్లె)పై.. ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్(నంద్యాల), గెలిచింది. ఖోఖో బాలికల ఫైనల్స్‌లో కేవీఎస్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(కర్నూలు) గెలిచింది. బాలుర విభాగంలో స్పోర్ట్స్ ఇన్‌డ్యూజువల్ చాంపియన్‌షిప్ కె.సురజ్‌కుమార్ బిట్స్ (కర్నూలు) దక్కించుకున్నారు. స్పోర్ట్ చాంపియన్ షిప్ జీఎంఆర్(శ్రీశైలం), గేమ్స్ చాంపియన్‌షిప్ ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్(నంద్యాల) దక్కించుకున్నాయి. బాలుర విభాగంలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్ జీఎంఆర్ (శ్రీశైలం) దక్కించుకుంది. బాలికల విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌షిప్‌గా స్పందన, నంద్యాల పాలిటెక్నిక్ నిలిచింది. స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ జీపీటీ (బేతంచెర్ల), గేమ్స్ చాంపియన్‌షిప్ పాలిటెక్నిక్ (నంద్యాల) దక్కించుకున్నాయి. బాలికల విభాగంలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ దక్కించుకుంది. 27వ ఐఏఎస్‌జీఎం 2024–25లో వివిధ పాలిటెక్నిక్ నుంచి వచ్చిన అధ్యాపకులకు క్రీడాపోటీలు నిర్వహించారు. అధ్యాపకుల మధ్య జరిగిన టేబుల్ టెన్నిస్ మెస్ సింగిల్ డబుల్స్ విభాగంలో జీఎంఆర్(శ్రీశైలం), ఉమెన్ సింగిల్ విభాగంలో జీపీటీ(బేతంచెర్ల), అధ్యాపకులు విజేతలుగా నిలిచారు. బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ విభాగంలో జీపీఎం(కర్నూలు), ఉమెన్స్ సింగిల్స్ విభాగంలో జీపీటీ బేతంచెర్ల, డబుల్స్ విభాగంలో ప్రభుత్వ పాలిటెక్నిక్(నంద్యాల) అధ్యాపకులు విజేతలుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. తెలుగుగంగ ప్రాజెక్టు ఇంజినీర్ సూపరింటెండెంట్ సుబ్బరాయుడు, రాజేష్, శ్రీనివాసరెడ్డి, రఘునాథరెడ్డి, డాక్టర్ సురేష్‌బాబు విజేతలకు బహుమతులను అందజేశారు. విజేతల జట్లు వచ్చే ఏడాది జనవరి 28, 29, 30 తేదీల్లో విశాఖపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు




శ్రీనివాససెంటర్‌లో ధర్నా చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని, ఆయన ప్రజలకు క్షమాపణ చెప్పాలని పలు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా మాల న్యాయవాదుల ఐక్యవేదిక, మాల మహానాడు, మాల మహాసేన, కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం స్థానిక శ్రీనివాస సెంటర్, వైఎస్సార్ విగ్రహం ఎదుట అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. మాల న్యాయవాదుల ఐక్యవేదిక నాయకుడు లింగమయ్య, ప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానకరంగా మాట్లాడటం దుర్మార్గమన్నారు. కడియం సాంబశివుడు, రాజ్‌కుమార్, చింతలయ్య, అబ్రహాం, ఇస్మాయిల్, శ్రీనివాసులు, రవికుమార్, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): అంబేడ్కర్ పట్ల అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పట్టణంలోని శ్రీనివాససెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు బాబాఫక్రుద్దీన్, సుంకయ్య, నాగరాముడు, ధనుంజయుడు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలతో ఐక్యతకు నాంది



నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): అమరవీరుల త్యాగఫలితమే హిందూ, ముస్లింల ఐక్యతకు నాంది అని ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు రియాజ్, బాబాఫక్రుద్దీన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో స్వాతంత్య్ర సమరయోధులు అష్ఫాఖుల్లాఖాన్, పండిత రాంప్రసాద్ బిస్మిల్ 97వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రైతు సంఘం నాయకులు సోమన్న, మాబాషా, కలాం, హరినాథ్ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడి ప్రత్యేక సంచికలు ఆవిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): స్వాతంత్య్ర సమరయోధుడు అష్ఫాఖుల్లా ఖాన్ వర్ధంతిని పురస్కరించుకొని నంద్యాల ముస్లిం జేఏసీ స్థానిక కార్యాలయంలో గురువారం ప్రత్యేక సంచికను నాయకులు విడుదల చేశారు. మహమ్మద్ అబులైజ్, అబ్దుల్ సమ్మద్ మాట్లాడుతూ దేశ స్వాతంత్య్ర కోసం 1927 డిసెంబర్ 19న ఉరి కంబాన్ని ముద్దాడిన అమరవీరులు పండిట్ రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్ సేవలను కొనియాడారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

రుద్రవరం: మండలంలోని ఆలమూరు ప్రభుత్వ వైద్యశాలలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులకు దంత వైద్యుడు బాషా పరీక్షలు చేసి జాగ్రత్తలను వివరించారు.

సర్వేలు వేగవంతం చేయండి

రుద్రవరం: సర్వే పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి సచివాలయ సిబ్బందికి సూచించారు. రుద్రవరంలోని 2,3, ఆర్.నాగులవరం గ్రామ సచివాలయాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లో హాజరుపట్టికతో పాటు వివిధ రికార్డులను పరిశీలించారు. మిస్సింగ్ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వేలను గ్రామాల్లో తిరిగి వేగవంతం చేయాలని ఆదేశించారు.

వంద శాతం ఫలితాలు సాధించాలి



సప్లిమెంటరీ పరీక్షలను పరిశీలిస్తున్న జీసీడీఓ

రుద్రవరం: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని జీసీడీఓ నాగసువర్చల అన్నారు. రుద్రవరం కేజీబీవీని గురువారం ఆమె తనిఖీ చేశారు. సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతుండడంతో పరిశీలించారు. ప్రణాళిక బద్ధంగా విద్యార్థులకు పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.